ప్రజాశక్తి
శనివారం 23 మార్చి 2024

ఏప్రిల్ 27న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-పాడేరు:రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 27న నిర్వహించనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కు (ఏపీ పాలీసెట్ 2024)కు ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాడేరు జి. యం. ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్. కె సుజాత పేర్కొన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, పదవ తరగతి ఉత్తీర్ణులైన, ప్రస్తుతం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు, ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5వ తేదీతో గడువు ముగుస్తుందని చెప్పారు. పదవ తరగతి పరీక్షలు ముగిసిన వెంటనే ఏప్రిల్ ఒకటి నుంచి స్థానిక జి.యంఆర్, పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. జి.యం.ఆర్, పాలిటెక్నిక్ పాడేరులో సివిల్- 60, మెకానికల్ -60, ఎలక్ట్రికల్ -60 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సి, ఎస్టి విద్యార్థులు రూ.100, ఓసి, బిసి విద్యార్థులు రూ.400 పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

‣ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ ‣అరకులోయలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- అరకు లోయ :రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ సూచించారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో రెండు కంపార్ట్మెంట్లు ఉంటాయని ఒకటి అసెంబ్లీకి, మరొకటి పార్లమెంటుకు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఓటర్ జాబితాలో పేరును సరి చూసుకొని ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులను వెంట తీసుకొని వెళ్లాలన్నారు.ఓటర్ ఐడి కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఎంప్లాయ్ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు పాస్ బుక్ వీటిలో ఏ ఒక్కటి నైనా తీసుకొని వెళ్లాలన్నారు. అరకు నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు ర్యాంపులు, మరుగుదొడ్లు నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగం పై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వివిఎస్ శర్మ, తహసిల్దార్ సుధాకర్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రహీం, సోమేశ్, పలువురు ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు చిహ్నన్ని చూపుతున్న పిఒ, అధికారులు, గిరిజనులు

ఇవిఎంల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

పాడేరు: ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడానికి పకడ్బందీ ఏర్పాటు చేయాలని అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రి సైడింగ్ అధికారులకు, పోలింగ్ సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేయడానికి సులువుగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎటువంటి లోపాలు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. వాహనాలు రావడానికి, వెళ్లడానికి అనువుగా ఉండే విధంగా సిద్ధం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిఈ అనుదీప్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగులు విక్రయిస్తున్న గిరిజనుడు

పుట్ట గొడుగులకు గిరాకీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని శుక్రవారం జరిగిన అరుకు వారపు సంతలో పుట్ట గొడుగులకు గిరాకీ ఏర్పడింది. పుట్టుగొడుగులు రుచికరంగా ఉండటంతో ఎగబడిమరీ కొనుగోలు చేశారు. పుట్ట గొడుగుల ఒక్కో కవరు రూ.100లకు గిరిజనులు విక్రయించారు. అరకులోయ మండలంలోని నడిమివలస గ్రామానిక చెందిన ఓ గిరిజనుడు సంతలో పుట్ట గొడుగులను తీసుకొచ్చి విక్రయించాడు. అతడు స్వయం ఉపాధికి ఇంటి సమీపంలో పుట్ట గొడుగుల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. కాపుకొచ్చిన పుట్ట గొడుగులను కవరులో రూ.100ల చొపున విక్రయించాడు. మన్యం పుట్ట గొడుగుల్లో పోషకాలు ఉండడంతో కొనుగోలు చేశారు.

కొత్తగా 4313 మంది ఓటర్లు నమోదు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలో 4313 మంది కొత్త ఓటర్లు నమోదు అయినట్లు తహాశీల్దార్ నాగజోతి తెలిపారు.శుక్రవారం స్దానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, 2023 సవత్సరంలో 35541 ఓటర్లు ఉండగా కొత్తగా 4313 నమోదు అయ్యారని, మొత్తం ఓటర్ల సంఖ్య 36918 పెరిగిందన్నారు. ఓటర్లు ఈ సార్వత్రిక ఎన్నిలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాని సూచించారు.

నిరసన తెలుపుతున్న సత్యసాయి వాటర్ స్కీమ్ కార్మికులు

జీతాల బకాయిలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి-రంపచోడవరం

తమకు బకాయి పడ్డ జీతాలను వెంటనే చెల్లించాలని కోరుతూ దేవిపట్నం మండలంలోని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సిపిడబ్ల్యు (కాంప్రహెన్సివ్ ప్రొటక్టివ్ వాటర్ సప్లై) స్కీమ్ వర్కర్లు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వక్కర్లు మాట్లాడుతూ ఒకపక్క భగభగ మండే ఎండల సమయంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదని అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న వర్కర్లకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సిపిడబ్ల్యు స్కిమ్ పురుషోత్తపట్నం పాత కాంట్రాక్టర్ 5 నెలలు, కొత్త కాంట్రాక్టర్ 5 నెలలు, కుట్రవాడ 20 నెలలుగా జీతాలు చెల్లించలేదని తెలిపారు. తమకు సకాలంలో జీతాలు చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటామని ప్రశ్నిస్తున్నారు. జీతాల చెల్లింపులో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు జీతాలు ఇస్తామని చెబుతూ వచ్చిన వారు ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ వచ్చిందని చెబుతూ చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్లు తక్షణమే స్పందించి జీతాలు చెల్లించి, తమ కుటంబాల ఆకలి బాధలు తీర్చాలని కోరారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కుస్తీ పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కొయ్యూరు

చిత్తూరులో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగిన 2024 అండర్-20 మెన్, ఉమెన్ ఛాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో కొయ్యూరు రెజ్లింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న గిరిజన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. రాష్ట్ర స్థాయిలో 8 బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించినట్లు రెజ్లింగ్ కోచ్ అంబటి నూకరాజు శుక్రవారం తెలిపారు. అండర్-15 విభాగంలో కూడా బాల బాలికలు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారన్నారు. వీరంతా ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన గిరిజన విద్యార్థులను, కోచ్ అంబటి నూకరాజును పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అభినందించారు. గిరి విద్యార్థులు క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్ట్ ఎడ్యుకేషన్ మేళా

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ప్రభుత్వ శిక్షణా కళాశాలలో శుక్రవారం ఆర్ట్ ఎడ్యుకేషన్ మేళా-2024 నిర్వహించారు. కళాశాల చాత్రోపాధ్యాయులు వినూత్నమైన ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. దీనికి రంపచోడవరం ఐటిడిఎ పథక నిర్వహణాధికారి, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మేళాలో ప్రదర్శించిన ప్రాజెక్టులను వీక్షించారు. చాత్రోపాధ్యాయులు తయారు చేసిన ఆహార పదార్థాలను రుచి చూసి వారి ప్రతిభను ప్రశంసించారు. రంపచోడవరం, ముసురుమిల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ ప్రాజెక్టులను వీక్షించారు. ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ప్రాజెక్టులను పరిశీలించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.చినబాబు, అధ్యాపకులు డాక్టర్ జి.భాస్కరరావు, జె.వెంకట లక్ష్మి, ఎం.సామ్రాజ్యం, కారం బాపిరాజు దొర, కె.సోమశేఖర్, డి అపర్ణ, కె పోతురాజు, పి శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌డబ్లుఓలు లక్ష్మీ కుమారి, వి.రాజ్ సిద్ధార్థ, పి లక్ష్మణ రెడ్డి, కె శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లు ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు

ప్రజాశక్తి-కొయ్యూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ వాలంటీర్లు ఎవరైనా ఎన్నికలకు సంబంధించిన ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొన్నా తక్షణమే విధుల నుంచి తొలగించడం జరుగుతుందని ఎంసిసి నోడల్ అధికారి, ఎంపీడీవో లాలం సీతయ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంసీసీ టీమ్ అప్రమత్తంగా వ్యవహరించకపోతే వారు కూడా ఎన్నికల కమిషన్ తీసుకునే తీవ్రమైన చర్యలకు గురవుతారని స్పష్టం చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు శివాలయంలో శివపార్వతుల కళ్యాణ మహొత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు భక్తులు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రజల ఆర్థిక సహాయంతో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది.

గిరిజనులకు సోలారు లైట్లు పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధి వలసపల్లి గ్రామంలోని గిరిజనులకు సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ సెకండ్ ఇన్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, జీకే వీధి సిఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సోలార్ లైట్లు పంపిణీ చేశారు. గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ యువత సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలని కోరారు. సివిక్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సిఆర్పిఎఫ్ మారుమూల గిరిజన గ్రామాల్లో అవసరమైన వ్యవసాయ పరికరాలు ఇంతకుముందే పంపిణీ చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రామకృష్ణ, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

గిరిజనులకు సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

ఉపాధి హామీ కూలీలకు సదుపాయాలు కల్పించాలి

- సిపిఎం నేతల డిమాండ్

ప్రజాశక్తి- పెదబయలు :ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు, సీతగుంట ఉపసర్పంచ్ బొండా గంగాధరం డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి కూలీల పని ప్రదేశాలలో సందర్శించారు. అనేక సమస్యలు వెలుగులో వచ్చాయి. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ, గతంలో పనిముట్లు, పారలు గుణపాలు సరఫరా చేసేవారని, నేడు కేంద్రం, రాష్ట్రంలో పరిపాలిస్తున్న పాలక పార్టీలు ఏమీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఉపాధి కూలీలకు పనిముట్లు సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.పని ప్రదేశంలో కూలీలకు టెంట్లు, మంచినీరు, ప్రమాదవసత్తు దెబ్బ తగిలితే గాయాలు పాలైతే ప్రథమ చికిత్స మెడికల్ కిట్లు, కూర్చోడానికి తార్పాలిన్లు, పని ప్రదేశంలో చిన్న పిల్లలను చూసుకోవడానికి ఆలయాలు వంటి సౌకర్యాలు కానరాలేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వం వామపక్షాల పార్టీల పోరాట ఫలితంగా 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చింన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని సవరణ చేయాలని చూస్తుందని దుయ్యబట్టారు. ఈ చట్టంతో అనేకమంది పేదలకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఉపాధిని కూడా రద్దు చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్పందించి వేసవికాలంలో ఉపాధి కూలీల పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత సన్నిబాబు

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:ఎన్నికల ప్రచారంలో గ్రామ వాలంటీర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొంటే విధుల నుంచి తొలగిస్తామని మండల ఎంసీసీ నోడల్ అధికారిణి, ఎంపీడీవో జయఉమ తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు అప్రమత్తంగా ఉండాలని, లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఆమె హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ జయ ఉమ

సరుకులు పంపిణీ చేస్తున్న ముస్లిం పెద్దలు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-చింతపల్లి:రంజాన్ మాసాన్ని (పర్వదినాన్ని) పురస్కరించుకుని మండల కేంద్రంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు స్థానిక ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 25 కేజీల బియ్యం, ఐదు కిలోల గోధుమపిండి, కేజీ నూనె, ఇతర నిత్యవసర సరుకులు గ్రామంలోని 15 నిరుపేద కుటుంబాలకు ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా, మజీద్ ఇమామ్ ఎండి ముజీబ్, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ఉప సర్పంచ్ నూరు బాబులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి- పెదబయలు :పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మెయిన్ రోడ్డు కలవర్ట్‌లో నిశితంగా పరిశీలించారు. కొత్తగా నిర్మిస్తున్న వంతెనలు, పాతబడిన బ్రిడ్జిల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్షుణంగా పరిశీలించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్ఐ పి.మనోజ్ కుమార్ శుక్రవారం తెలిపారు.

రంపచోడవరంలో సిపిఎం విజయం ఖాయం

ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-కూనవరం

రానున్న ఎన్నికల్లో రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి సిపిఎం అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని మార్తా శ్రీరామ్మూర్తి భవన్‌లో శుక్రవారం జరిగిన సిపిఎం జనరల్ బాడీ సమావేశంలో కిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన సీపీఎంకు మాత్రం ఓటు అడిగే హక్కు ఉందన్నారు. వరదల సమయంలో ముంపు బాధితులకు సిపిఎం చేయుత అందించిందని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఏమి పట్టనట్లు వ్యవహారిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఓటు అడిగే హక్కు లేదని స్పష్టం చేశారు. రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చట్ట సభల్లో పోరాడే ఒక గొంతుక రంపచోడవరం నియోజక వర్గం నుండి పంపించేందుకు సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలను ప్రజా రక్షణ భేరి యాత్ర ద్వారా రాజకీయ అజెండాలోకి సిపిఎం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపీటీసీ జయసుధ, సర్పంచులు బొగ్గా వెంకమ్మ, సోడే శంకర్, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

నిర్వాసితులకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం

ప్రజాశక్తి-విఆర్.పురం : పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని, గత ఐదేళ్లగా వాగ్దానాలను గాలికొదిలేసింద సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు విమర్శించారు. మండలంలోని కోటారుగొమ్ము గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ పది లక్షల 80వేల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి, దానిని నిలబెట్టుకోలేదని తెలిపారు. ఎకరాకు రూ.5 లక్షలు ఇస్తామన్న హామీ నీటి మీద రాతలుగానే మిగిలిందన్నారు. పునరావాస కాలనీలు ఎక్కడ పూర్తి చేయలేదని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేడు ఎక్కిరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో నాయకులు వల్ల కృష్ణారెడ్డి, కదల కొండయ్య రెడ్డి, పంకు సత్తిబాబు, చీరపు తాతబాబురెడ్డి మల్లయ్య, కారం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

పాడేరు టికెట్ గిడ్డి ఈశ్వరికే కేటాయించాలి

ప్రజాశక్తి -సీలేరు

పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి టికెట్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికే కేటాయించాలని ఆ పార్టీ బిసి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నక్క తిరుమలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాడేరు టికెట్ బిజెపికి కేటాయిస్తే టిడిపి నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. గ్రామస్థాయిలో పది మంది కూడా లేని బిజెపికి పాడేరు అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే వైసిపి గెలుపు సునాయాసం అవుతుందన్నారు. అధిష్టానం పునరాలోచన చేసి టిడిపికి టికెట్ కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. గత ఐదు సంవత్సరాల నుండి గిడ్డ ఈశ్వరికి కార్యకర్తలు అండగా ఉన్నారని, ఆమెకు సీటు కేటాయిస్తే టిడిపి గెలుపు ఖాయమని పేర్కొన్నారు.

హెచ్చరిక బోర్డు తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతగిరి:ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తొలగింపుపై సిపిఎం నాయకులు ఫిర్యాదు చేశారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ అరకు మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు గిరిజననేత్రుడు అక్రమంగా తొలగించాలని విమర్శించారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం బంగారంపెట పంచాయతీ నాయకులు కాకర సింగులు, మామిడి కృష్ణలు తహాశీల్దార్ నాగజ్యోతిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాశీపట్నం రెవిన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 13 /1, 13 /2 లో సుమారు నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ఇది ప్రభుత్వ భూమిగా గుర్తించిన రెవిన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని చెప్పారు. ఆ భూమి సాగులో ఉండగా గిరిజనేతురుడు రాళ్లపూడి ఎర్రి బాబు అనే వ్యక్తి బోర్డును తొలగించి క్రయవిక్రయాలు చేపట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని, లేకుంటే భూమి లేని రైతులకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే తామే రైతులను భూమిలో దించి దున్నుకుంటామని వారు స్పష్టం చేశారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి భూమిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

మామిడిపాలెంలో అభయహస్తంపై ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి- భీమునిపట్నం :కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ రాజ్యంలో పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతామని ఆ పార్టీ నాయకులు కదిరి జగన్నాథం, గాదం మహేష్ అన్నారు శుక్ర వారం స్థానిక బ్యాంక్ కాలనీ, మామిడిపాలెంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించి, ఓటేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకత్వంలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ "ఇండియా కూటమి' అధికారంలోకి రావడం ద్వారానే ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కాకుండా పరిరక్షించుకోవడం సాధ్యమన్నారు. అభయహస్తం కర పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు

విద్యార్థులు సేవా కార్యక్రమాలను కొనసాగించాలి

ప్రజాశక్తి -ములగాడ: విద్యార్థులు సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఎయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, 2 ఆధ్వర్యంలో ఇందిరా కాలనీ, బర్మా కాలనీలలో వారం రోజుల ప్రత్యేక సేవా శిబిరాల ముగింపులో మాట్లాడుతూ, సేవ చేయడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవాడతాయన్నారు.

ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. యూనిట్ -1 ప్రోగ్రాం అధికారి ఎ.సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, సిస్టర్ జయశీల, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి వివరించారు. అంగన్వాడీ బాలలకు స్టీలు పాత్రలను పంపిణీ చేశారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. మానవహారంగా ఏర్పడ్డారు. ఎన్ఎస్ఎస్ పిఒ ఇపిఎస్.భాగ్యలక్ష్మి సమన్వయం చేశారు

మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

● పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్

ప్రజాశక్తి- అరకులోయ :కొత్త బల్లు గూడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలలో పది పరీక్షల కేంద్రాన్ని శుక్రవారం పాడేరు ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీనికి ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు తాగునీటి, విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలో అత్యవసర వైద్య సుదుపాయాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. బయట వ్యక్తులు ఎవరు పాఠశాలలోకి ప్రవేశించకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమాధికారి మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

202 మంది గీతం విద్యార్థులకు ఉద్యోగాలు

ఉద్యోగాలకు ఎంపికైన గీతం విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు 202మందికి క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలు లభించాయి. రెండు రోజులుగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), క్యాప్ జెమిని నిర్వహించిన ప్రాంగణఎంపికలు నిర్వహించినట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజుల శుక్రవాం వెల్లడించారు. క్యాప్ జెమిని సాఫ్ట్‌వేర్ 90 మంది విద్యార్థులను ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపిక చేసుకోగా, టిసిఎస్ 112 మంది విద్యార్థులను అసిస్టెంట్ సిస్టమ్ ఇంజనీర్ ఉద్యోగాలను ఆఫర్ చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన గీతం విద్యార్థులకు రూ.4.25లక్షల నుంచి రూ.11 లక్షల వరకు వార్షిక వేతనం లభించనుందన్నారు. డెల్లాయిట్, ఐబిఎమ్, మూసిగ్మా, ఫ్యూచర్ ఫస్ట్, బోష్, మైక్రాన్, హుండాయ్, టాటా ఎలాక్సి వంటి మరికొన్ని ప్రముఖ సంస్థలు గీతం విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు జరపడానికి ఆసక్తి కనబరిచాయని వెల్లడించారు. అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగాలు సాధించడానికి గీతం జిసిజిసి ఇచ్చిన శిక్షణ, వ్యక్తిత్వ వికాస తరగతులు, సాంకేతిక సదస్సులు, నమూనా ఇంటర్వ్యూలు, హ్యాన్ పోటీలు ఉపయోగపడ్డాయని తెలిపారు.ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ అభినందించారు. జిసిజిసి డిప్యూటీ డైరక్టర్ ఎ.వెంకటేష్ ఉన్నారు.

విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు నామినేషన్ ఘట్టం శుక్రవారంతో ముగిసింది గడువులోగా వివిధ పోస్టులకు 57 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి కె.నరసింహమూర్తి తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి బెవరా సత్యనారాయణ, తాళ్లూరి రవికుమార్, సన్నీ యాదవ్, ఐఎం మహమ్మద్ నామినేషన్ దాఖలు చేయగా, ఉపాధ్యక్ష పదవికి ఏడు నామినేషన్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శి పదవికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ స్టేట్ సెక్రటరీ, విశాఖపట్నం యూనిట్ జనరల్ సెక్రెటరీ నూకల వెంకటేశంతో పాటు మరో ఐదుగురు నామినేషన్లు చేశారు. సంయుక్త కార్యదర్శి పదవికి ఇద్దరు, కోశాధికారికి నలుగురు, స్పోర్ట్స్ సెక్రటరీ పదవికి నలుగురు నామినేషన్లను దాఖలు చేశారు. ప్రతిసారీ ఏకగ్రీవమైన లేడీస్ రిప్రజెంటేటివ్ పదవికి తాజా ఎన్నికల్లో ఇద్దరు నామినేషన్లు వేశారు. జూనియర్ సభ్యులుగా 16 మంది.. 20ఏళ్ల సీనియర్ సభ్యులుగా ఇద్దరు, 30ఏళ్ల సర్వీసు పైబడిన కేటగిరీ సభ్యులుగా ఇద్దరు నామినేషన్లు వేశారని ప్రధాన ఎన్నికల అధికారి కె.నరసింహమూర్తి సహాయ ఎన్నికల అధికారులు ఎంకెఎస్ శ్రీనివాస్, బండి ప్రభాకర్ తెలిపారు. 25న సోమవారం నామినేషన్ల పరిశీలన,

నామినేషన్లు వేస్తున్న న్యాయవాదులు

26,27తేదీల్లో ఉపసంహరణలు, 28న పోటీ అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తామన్నారని ఎన్నికల అధికారి తెలిపారు.

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని అరుకు సంతబయలు అరకు పాడేరు ప్రధాన రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకంది. దీనికి సంబంధించిన వివరాలు... అరుకు సంతబయలు నేరుడువలస గ్రామానికి చెందిన మండకుర్తి రవికుమార్(34) తన ఇంటి నుంచి బయలుదేరి చెల్లెలి ఆధార్ కార్డు అప్డేట్ చేయించుకోవడానికి కోసం మీ-సేవకు బయలు దేరారు. మీ-సేవ ప్రతినిధులతో సంప్రదించిన ఆయన చెల్లెలిని తీసుకురావడానికి తన ఇంటికి స్కూటీపై బయలుదేరాడు. స్కూటీపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు విశాఖపట్నంలో కంప్యూటర్ల మరమ్మతు పనులు చేస్తూ ఉపాధిని పొందుతున్నాడు. పోలీసులు మృతదేహాన్ని అరకు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాడేరు ఎమ్మెల్యే టిక్కెట్ కాంక్షిస్తూ

మోదమ్మకు గిడ్డి ఈశ్వరి పూజలు

తలపై ఘటాలతో మోదకొండమ్మ మొక్కులు తీర్చుకునేందుకు వెళుతున్న గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి టికెట్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి కేటాయించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని చింతల వీధి మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు మహిళలు, కార్యకర్తలు 101 బిందెలతో మోదకొండమ్మ అమ్మవారిని అభిషేకించి పూజలు చేశారు..

జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో

బుల్లయ్య కాలేజీ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ సెక్రటరీ

ప్రజాశక్తి- సీతమ్మధార :ఉత్తరప్రదేశ్ మీరట్‌లోని స్వామివివేకానంద శుభార్తీ యూని వర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ మహిళల, పురుషుల ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానికడాక్టర్ లంకపల్లి బుల్లయ్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిగ్రీ ఫస్టియర్ విద్యార్థిని బి.ఆశ్రిత 50 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. బిఎస్‌సి ఫస్టియర్ విద్యార్థి కె.పథ్వీరాజ్ 63 కేజీల విభాగంలోకాంస్య పతకాన్ని సాధించాడు. వీరిని కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె. చక్రవర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సోమేశ్వర్ రెడ్డి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్ లక్ష్మణ్‌రెడ్డి అభినందించారు.

డ్రగ్స్ కేసును సిబిఐనే దర్యాప్తు చేస్తోంది

- మీడియాతో విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌లో పట్టుబడ్డ డ్రగ్స్‌కు సంబంధించిన కేసును సిబిఐనే దర్యాప్తు చేస్తోందని, ఆ కేసుకు సంబంధించి స్థానిక పోలీసుల పాత్ర ఏమీ లేదని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం పోలీస్ కమిషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రెజిల్ నుంచి సంధ్య మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ పేరున డ్రగ్స్‌తో కూడిన కంటైనర్ విశాఖ వచ్చిందని, ఇంటర్ పోల్ సమాచారంతో సిబిఐ, కస్టమ్స్ అధికారులు గుర్తించారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సిబిఐ వారు డాగ్ స్క్వాడ్ బృందం కావాలని తమను కోరగా తాము అందించామన్నారు. అంతకుమించి ఈ కేసులో నగర పోలీసు అధికారుల పాత్ర లేదని తెలిపారు. జరిగిన కాలయాపనను కప్పిపుచ్చేందుకే ఎఫ్ఐఆర్ అలా రాసి ఉంటారని ఆయన అన్నారు. విశాఖలో మాదక ద్రవ్యాల మీద ఉక్కుపాదం మోపుతున్నామేగానీ సిబిఐ విధి నిర్వహణకు ఏ విధమైన అడ్డూ తమవల్ల కలగలేదన్నారు. మాదక ద్రవ్య రవాణాదారులు విశాఖను రవాణా కేంద్రంగా వాడుకుంటున్నారే తప్ప ఇక్కడ మాదక ద్రవ్యాల వినియోగం లేదని అన్నారు.

డ్రగ్స్ రాకెట్‌పై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 25 వేల కిలోల డ్రగ్స్ విశాఖలో పట్టుబడిన నేపథ్యంలో ఆ రాకెట్‌పై సమగ్ర దర్యాప్తు జరపాలని, దిగుమతికి పాల్పడిన డ్రగ్ మాఫియాను కఠినంగా శిక్షించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్ సంస్థకు చెందిన వారిని ఇప్పటివరకూ అరెస్ట్ చేయకపోవడంతో అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. అలాగే ఆ సంస్థకు టిడిపి, బిజెపి, వైసిపిలతో సంబంధాలు ఉన్నట్లు ప్రస్తుతం ఆయా పార్టీల విమర్శలను బట్టి తెలుస్తోందన్నారు. ఈ నెల 16న కంటైనర్ విశాఖ వచ్చినప్పటికీ 21 వరకూ ఎందుకు ప్రకటన చేయలేదని, దీని వెనుక బలమైన రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. అందుకనే ఇప్పటివరకు సమగ్రమైన సమాచారాన్ని బహిర్గతం చేయకపోవడంతో పాటు ఎవ్వరినీ అరెస్ట్ చేయలేదని తెలిపారు. ఈ వైఖరిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తక్షణం సమగ్ర దర్యాప్తు జరిపి ఈ డ్రగ్ మాఫియాతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విశాఖ కంటైనర్ యాజమాన్యాన్ని కూడా ప్రాసిక్యూట్ చేయాలన్నారు. కంటైనర్ టెర్మినల్‌ను ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టడం వల్లే ఈ డ్రగ్స్ యథేచ్ఛగా దిగుమతి అవుతున్నాయని తెలిపారు. తక్షణం కంటైనర్ టెర్మినల్‌ను విశాఖ పోర్టు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశాంత విశాఖ నగరాన్ని డ్రగ్స్ కేంద్రంగా పాలక రాజకీయ పార్టీలు మార్చేశాయని విమర్శించారు. ఈ పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

డాక్టర్ రమణమూర్తితో ఎమ్మెల్యే వాసుపల్లి భేటీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని కళా ఆసుపత్రి అధినేత డాక్టర్ పివి.రమణమూర్తి వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ రమణ మూర్తిని సత్కరించి అభినందించారు. కాసేపు భేటీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రమణమూర్తి సహకారం కోరారు. ప్రస్తుతం దక్షిణంలో వైసిపి పరిస్థితి, ప్రజల ఆదరణ తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా వార్డుల వైసిపి అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ - సంత్రాగచ్చి మధ్య హోలీ ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హోలీని పురస్కరించుకుని సికింద్రాబాద్ - సంత్రాగచ్చి మధ్య రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 07645 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి హోలీ ప్రత్యేక రైలు 23న రాత్రి 21.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09:35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 09:40 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 00.05 గంటలకు సంత్రాగచ్చికి చేరుకుంటుంది. 07646 సంత్రాగచ్చి - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు 25న ఉదయం 05.45 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి అదే రోజు రాత్రి 19:35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 19:40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:08 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బెర్హంపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, జద్రాగ్‌హర్ రోడ్, బలాక్‌జపూర్, కటక్ మీదుగా ప్రయాణిస్తాయి.

టిడిపి మూడో జాబితాలో..

దోబూచులాట !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు శుక్రవారం కూటమి పార్టీల తరపున విడుదల చేసిన అభ్యర్థుల మూడో జాబితా దోబూచులాటను గుర్తుకు తెచ్చేలా ఉంది. ఒకటి, రెండు జాబితాల్లో చాలా అసెంబ్లీ సెగ్మెంట్లపై స్పష్టతకు రాలేని కూటమి నేతలు తాజాగా తర్జనభర్జనలు పడిన తర్వాత కాసింత కొలిక్కి వచ్చినట్టు అర్థమవుతోంది. విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థిత్వంపై బిజెపి, టిడిపి మధ్య జరిగిన చర్చల్లో నిన్నటివరకూ ప్రతిష్టంభన కొనసాగిన సంగతి తెలిసిందే. ఇప్పటికీ ఆ టికెట్ ఆశిస్తున్న బిజెపి నాయకులు జివిఎల్.నరసింహారావు ఢిల్లీకెళ్లి మకాం వేసినట్లు తెలుస్తోంది. జివిఎల్‌కు అవకాశమిస్తే వైసిపికి సీటు ఇచ్చినట్టేనంటూ టిడిపి నుంచి బిజెపి అధిష్టానానికి సైతం ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. మొత్తానికి తర్జనభర్జనల అనంతరం ఎట్టకేలకు విశాఖ ఎంపీ సీటును గీతం విద్యాసంస్థల అధినేత భరత్‌కు కేటాయించడంతో టిడిపి శ్రేణులు ఊపిరిపీల్చుకున్నాయి. తొలి నుంచి విశాఖ ఎంపీ సీటుపై బిజెపి పట్టుబడుతూ వస్తోంది. టిడిపి నేతలు ఈ విషయాన్ని గుర్తెరిగి ఈసారి భరత్‌కు ఇవ్వకపోతే జరుగబోయే పరిణామాలకు అధిష్టానమే బాధ్యత వహించాల్సి ఉంటుందని బాహాటంగానే చెప్పేశారు. మొత్తానికి భరత్‌కు ఎంపీ అభ్యర్థిగా అవకాశం దక్కడం, ఈ పార్లమెంట్ పరిధిలోగల విజయనగరం జిల్లా శృంగవరపు కోటకు సంబంధించి మాజీ ఎంఎల్ఎ కోళ్ల లలిత కుమారికి టిడిపి అవకాశం ఇవ్వడం వంటి అంశాలు ఆ పార్టీ శ్రేణులకు ఊరట కలిగించినట్టయింది.

శ్రీభరత్
(టిడిపి విశాఖ ఎంపీ అభ్యర్థి)

విశాఖ ఎంపీ సీటు శ్రీభరత్‌కు ఖరారు
భీమిలి అసెంబ్లీ స్థానంపై కొనసాగుతున్న ఉత్కంఠ

తేలని భీమిలి

విశాఖ పార్లమెంట్ స్థానం తేలితేగానీ భీమిలి అసెంబ్లీ తేలదన్న వాదనలతో టిడిపి శ్రేణులు ఇంతవరకూ ఉన్నాయి. ఈ సీటు విషయంలోనూ టిడిపి అధిష్టానం దోబూచులాట ప్రదర్శిస్తూ వస్తోంది. బిజెపి ప్రమేయం లేకుండానే కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన పార్లమెంట్ సీటును భరత్‌కు ఇచ్చేశాయన్న వాదన కూడా మరోవైపు వినిపిస్తోంది. భీమిలి టికెట్‌పై ఇప్పటికే గంటా శ్రీనివాసరావు కన్నేశారు. ఆయనకు ఇక్కడ కాకుండా విజయనగరం జిల్లా చీపురుపల్లి ఇవ్వాలని టిడిపి అధిష్టానం పట్టుదలతో ఉన్నా గంటా ససేమిరా అనడంతో భీమిలి టికెట్ ప్రకటన ఇంతవరకూ జాప్యం చేస్తూ వచ్చారు. చివరకు విశాఖపట్నం ఎంపీ స్థానాన్ని భరత్‌కు ఇవ్వడం ద్వారా భీమునిపట్నం అసెంబ్లీ సీటును గంటాకు లైన్‌క్లియర్ చేసి టిడిపి అధిష్టానం ఉంచినట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి, వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి కొన్నాళ్లుగా నియోజకవర్గంలో ప్రచారంలో ముందున్నారు. ఆయన్ని ఢీకొట్టగలిగేది గంటానేనన్న అభిప్రాయం పలువురిలో వ్యక్తమవుతోంది.

అనకాపల్లికి చెందిన హైదరాబాద్‌లో స్థిరపడ్డ వ్యాపారవేత్త, బైరా ఫౌండేషన్ అధినేత బైరా దిలీప్ చక్రవర్తికి భీమిలి టికెట్ వచ్చే అవకాశముందని వార్తలొస్తున్నాయి. ఆయన మూడేళ్లుగా అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ టిడిపి, జనసేనలకు దగ్గరగా ఉంటూ వస్తున్నారు. ఆయన పేరూ పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది.

బండారుకు తొలగిన భ్రమలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

టిడిపి, జనసేన, బిజెపి పొత్తు చివరకు టిడిపిలో సీనియర్లకు టికెట్ లేకుండా చేసింది. శుక్రవారం టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థుల మూడో జాబితాతో ఇంతవరకు టికెట్‌పై వున్న కొద్దిపాటి ఆశ టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి పోయింది. పెందుర్తి టికెట్ జనసేనకు కేటాయించినట్లు చంద్రబాబు చెప్పినా, టికెట్ వస్తుందన్న భ్రమలో సత్యనారాయణమూర్తి ఇప్పటి వరకూ వున్నారు. తన అల్లుడైన శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆయన చిన్నాన్న అచ్చెన్నాయుడు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కావడంతో పొత్తులో తన టికెట్‌కు వున్న ఆటంకాలు తొలగిస్తారని ఆయన నమ్మారు. కానీ అవేవీ చంద్రబాబు పొత్తుల నిర్ణయంలో చెల్లుబాటుకాలేదు. యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాలు జనసేనకు కేటాయింపుపై ఆ నియోజకవర్గ టిడిపి నాయకత్వం నుంచి వచ్చిన ఒత్తిళ్లను సైతం బాబు లెక్కచేయలేదు. దీంతో ఇప్పటికీ అసంతృప్తి రాజుకుంటోంది తప్ప తగ్గడంలేదు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఇలావుంటే అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బిజెపికి కేటాయించడంతో మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు సహా టిడిపి నాయకులు అయిష్టంగా వున్నారు. విశాఖపట్నం ఎంపీ టికెట్ బిజెపికి కేటాయించి, అనకాపల్లి టిడిపి తీసుకోవాలని ఒక దశలో చంద్రబాబు ప్రయత్నించినట్లు తెలిసింది. అందుకనే... భరత్‌కు రెండో జాబితాలో చోటు దక్కలేదు. బిజెపి రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్‌కు విశాఖపట్నం ఎంపీ టికెట్ ఇవ్వడానికి బిజెపి అంగీకరిస్తే, ఈ నియోజకవర్గం బిజెపికి వదిలిపెట్టి, అనకాపల్లి టిడిపి తీసుకోవాలన్న ఆలోచనలో చంద్రబాబు వున్నారు. అయితే, విశాఖపట్నం నుంచి రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావు పోటీచేయడానికి పట్టుబట్టారు. బిజెపి స్థానిక నాయకుల అంతర్గత కలహాలతో సిఎం రమేష్‌కు టిక్కెట్ రాదని గ్రహించిన చంద్రబాబు విశాఖపట్నం టిడిపి ఎంపీ అభ్యర్థిగా భరత్‌ను ప్రకటించారు. తనకు అత్యంత సన్నిహితుడైన సిఎం రమేష్‌ను విశాఖ నుంచి బిజెపి తరపున బరిలో దించాలన్న చంద్రబాబు ప్రయత్నాలు ఫలించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అనకాపల్లిని బిజెపికి వదిలేసి, విశాఖపట్నం టిడిపి తీసుకుంది. అనకాపల్లి టికెట్ సిఎం రమేష్‌కు బిజెపి ఇవ్వనుంది. ఆయనకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని టిడిపి ప్రధాన నాయకత్వంతో సంబంధాలున్నాయి. ఈ క్రమంలో సిఎం రమేష్ విజయానికి టిడిపి నాయకత్వం పనిచేస్తుందన్న అభిప్రాయం చంద్రబాబులోనూ, బిజెపి నాయకత్వంలోనూ వుంది. అందుకని అనకాపల్లి నుంచి రమేష్‌ను బిజెపి బరిలోకి దింపనుంది.

మూడో జాబితాతో టికెట్ రాదని రూఢీ

దారాలమ్మ ఆలయం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలంలోని దారాలమ్మ అమ్మవారి ఆలయం హుండీని దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కింపు చేపట్టారు. మూడు నెలల్లో హుండీ నుండి 2 లక్షల 4వేల రూపాయలు ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ సొమ్మును ప్రభుత్వ దేవాలయ శాఖ ఖాతాకు జమ చేస్తారు. ఈ సందర్భంగా ఈవో సాంబశివరావు విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారు పండుగ సమీపిస్తుండడంతో ముందస్తుగానే హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టామన్నారు. నూతనంగా దారాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి 50 లక్షల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని, ఈ పనులు శరవేగంగా జరిగింది తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి, స్థానిక పెద్దలు వెంకటేష్, రెడ్డి రామారావు, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులతో ప్రమాదాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : ఏజెన్సీలో జాతీయ రహదారి 516ఇ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కొయ్యూరు, రాజవొమ్మంగి మండలాల సరిహద్దులో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టడంలో కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు, ప్రయాణికులే జాగ్రత్తలు పాటించాలని కొయ్యూరు, మంప ఎస్ఐలు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం చింతలపూడి వద్ద చింతాలమ్మ ఘాట్ రోడ్డులో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. బ్లాస్టింగ్‌లు చేస్తుండడంతో రాళ్లు ఎగిరిపడుతున్నాయి. జెసిబిలతో కొండను తవ్వుతున్నారు. పెద్ద పెద్ద రాళ్లు తొలగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ ప్రాంతంలో వాహనదారులు జాగ్రత్తలు తీసుకొని ప్రయాణించాలని పోలీసులు సూచిస్తున్నారు. కొన్నిచోట్ల గోతులు ఉన్నాయని, రాత్రిపూట ప్రయాణాలు చేస్తున్నవారు మరింత అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే రహదారి మధ్యలో నీళ్లు ఎక్కువగా జల్లటం వలన, పనులు చేస్తున్న జాతీయ రహదారి సిబ్బంది కొన్ని చోట్ల జాగ్రత్తలు వహించకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటువంటి ప్రాంతంలో నెమ్మదిగా భద్రంగా వెళ్లాలని ఎస్ఐలు కోరుతున్నారు.

60 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని సీతంశెట్టి నగర్‌లో 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు రంపచోడవరం సిఐ వెంకటేశ్వరావు తెలిపారు. స్థానిక సీతంశెట్టి నగర్‌లో నాటుసారా అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి సారా అమ్ముతున్న ఒక మహిళను అరెస్ట్ చేసి, ఆమె వద్ద నుండి సుమారు 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎస్సై మోహన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని ఒట్టిగడ్డ గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని స్థానిక ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి నాగులాపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసిపి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చినట్లు చెప్పారు. ఏజెన్సీలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపిని గెలిపించాలని కోరారు. ఇందు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, తంటికొండ సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, పలువురు వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

నేడు, రేపు ఉమెన్ కార్డియాక్ కేర్ జాతీయ సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా 16వ ఉమెన్ కార్డియాక్ కేర్ జాతీయ సదస్సును ఈ నెల 23, 24 తేదీలలో విశాఖ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు ఉమెన్ ఇన్ కార్డియాలజీ అండ్ రిలేటెడ్ సైన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుజాత విప్పర్ల తెలిపారు. దసపల్లాలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సదస్సుకు 300 నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతారని, దేశ, విదేశాల నుంచి ప్రఖ్యాత మహిళా కార్డియాలజిస్టులు, పరిశోధకులు హాజరై అభిప్రాయాలు వెల్లడిస్తారని తెలిపారు. గుండె మార్పిడి చేసుకోవడానికి, సంచలనాత్మకమైన పరిశోధనలు అందించడానికి కార్డియోవాస్కులర్ మెడిసిన్‌లో వచ్చిన తాజా పురోగతిని చర్చించడానికి ఈ సమావేశం దోహదపడుతుందన్నారు. ఈ సదస్సు ఎపిలో విశాఖపట్నంలో నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు.